క్లుప్తంగా

కండలేరులో 13.102 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 13.102 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయానికి వరదకాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నగదు అందజేత



నగదు అందజేస్తున్న అధికారులు

దొరవారిసత్రం: కాళంగినది పరివాహక ప్రాంతంలోని తనియాలి, మావిళ్లపాడు గ్రామాల్లోని వరద బాధితులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సోమవారం రెవెన్యూ అధికారులు పరిహారం అందజేశారు. కుటుంబంలో ఒక్కరు ఉన్నవారికి రూ.వెయ్యి, ఇద్దరున్న కుటుంబానికి రూ.2 వేలు ఆపై ఎంత మంది ఉన్నా రూ.2500 వంతున నగదును అందజేస్తున్నట్లు తహసీల్దార్ గోపినాధ్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో విజయ్ దివస్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం విజయ్‌దివస్‌ను పురస్కరించుకుని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 1971లో పాకిస్తాన్‌పై యుద్ధంలో భారత్ సాధించిన విజయానికి ప్రతీకగా విజయ్‌దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. జాతీయ సమైక్యతను చాటుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. పీడీ శోభారాణి, మాధవయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేస్తాం

చిట్టమూరు: మండలంలోని ఆరూరు పంచాయతీ అనగొల్లపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపస్తామని ఈఓపీఆర్డీ మనోహర్ గౌడ్ తెలిపారు. వరదల కారణంగా గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. దీంతో సోమవారం ఆయన కోతకు గురైన రోడ్డును పరిశీలించారు.

పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

చిట్టమూరు: మండలంలోని కలుగుర్తిపాడులో సోమవారం రాత్రి పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బీ వెంకటకృష్ణయ్య కుటుంబసభ్యులతో కలసి ఇంటి బయట వసరాలో కూర్చుని భోజనం చేస్తున్నారు. ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పంటుకుని మంటలు రేగాయన్నారు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడి నుంచి పరుగులు తీశారన్నారు. కొద్ది సేపటికే ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. రాత్రి సమయం కావడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయిందని బాధితులు పేర్కొన్నారు. కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, పక్క ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

పరిష్కారానికి చర్యలు

వెంకటగిరిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు కౌన్సిలర్ ఏ శంకరయ్య పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు.

మంచి చేసే వారికి మద్దతు

నాయుడుపేటటౌన్: మంచి చేసే వారికి ప్రజల మద్దతు ఎప్పుడు ఉంటుందని అమీర్ షావలీ, నూర్ మసీదుల మౌలానాలు అష్రాఫ్, యూసుఫ్ పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మౌలానాలు, మైనారిటీ నాయకులు మాట్లాడారు. మసీదుల వద్ద జమాత్‌లు ఎప్పుడు పార్టీల గురించి మాట్లాడరన్నారు. అయితే కొంత మంది మసీదులు, జామత్‌లకు వైఎస్సార్ సీపీ దూరమవుతుందని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు డాక్టర్ అలీ, షేక్ షబ్బీర్, షేక్ రహతుల్లా, కింగ్సవే జిలాని మాట్లాడుతూ మసీదుల నిర్వాహకులు, జమాత్‌ల వారు వైఎస్సార్ సీపీ విభేదిస్తున్నట్లు ఎప్పుడు ఎక్కడ చెప్పలేదన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కోట: ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వాకాడు తాలూకా యూనిట్ 19వ వార్షికోత్సవం సోమవారం కోట షాదీమంజిల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి పెన్షనర్లు హాజరయ్యారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం సీనియర్లను ఘనంగా సన్మానించారు. అలాగే ఈ ఏడాది మృతి చెందిన పలువురు పెన్షనర్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఓ రవీంద్రకుమార్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుబ్రమణ్యం, అసోసియేషన్ నాయకులు వెంకటాచలం, భోగేశ్వరరావు, జే ప్రసాద్, కే రాఘవయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో వైద్యానికి పెద్దపీట





వెంకటగిరి రూరల్: సీఎం సందేశాన్ని వింటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గూడూరురూరల్: మాట్లాడుతున్న దేవసేనమ్మ

సైదాపురం(వెంకటగిరి): రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం ఆరోగ్య వంతంగా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో వైద్యరంగానికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలు పెంచి, వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించిన కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కౌన్సిలర్లతో కలసి తిలకించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటి ముంగిటే వైద్యపరీక్షలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి, కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. చికిత్స అనంతరం వైద్యశాల నుంచి ఉచిత రవాణా సౌకర్యం కలిప్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, కమిషనర్ వెంకటరామయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం జగన్ ధ్యేయం

గూడూరురూరల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని సచ్చాంధ్ర కార్పొరేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేనమ్మ అన్నారు. సోమవారం సీఎం జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా కొత్త ఫీచర్లతో ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేవసేనమ్మ, కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు వీక్షించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో దేవసేనమ్మ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని, వారి కాళ్లపై నిలబడాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోరిక అన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని, ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ఆయన దృష్టి పెట్టారని తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి పింఛన్లను రూ.3 వేల వంతున అందజేస్తారన్నారు. ఒకప్పుడు పింఛన్ కోసం క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా ప్రతినెలా ఒకటో తేదీనే ఇస్తున్నారన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పేదలకు సేవ చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్ రెడ్డి, గోపాల్ యాదవ్, జే వాసు, సాయి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్యం

దక్కిలి: పేద, మధ్యతరగతి ప్రజలందరికీ మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎంపీపీ రాజశేఖర్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి, ప్రతి ఒక్కరికీ వైద్యం అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సరికొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి ఒక్కరికీ కార్డులు అందించి రూ.25 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చునన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎస్‌ఎంలు, ఆశ వర్కర్స్, వలంటీర్లు అధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, వైద్యాధికారి బిందు ప్రియాంక, ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శాంతి కల్యాణం



కల్యాణం చేస్తున్న పురోహితులు

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి,అమ్మవార్ల శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. స్కందషష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేశారు. అరుణోదయకాలపూజ, పల్లకీ సేవ, మహాన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలను ఆలయ అర్చకుడు మూలంరాజు భానుప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, వేద మంత్రోచ్ఛారణ నడుమ శాంతి కల్యాణం జరిపించారు. రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మల్లాం గ్రామానికి చెందిన డీ శేషురెడ్డి, రామరాఘవరెడ్డి, రామలింగారెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఘనంగా స్కంధషష్టి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట రూరల్: మండల కేంద్రంలోని గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామి స్కంధ షష్టి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి విగ్రహానికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.



పాల్గొన్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్కంధషష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం సహస్ర కుంకుమార్చన పూజలు జరిపారు. ఈ పూజల్లో ఆలయ వ్యవస్థాపకుడు సీ మోహనకృష్ణ, ఉభయకర్తలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విందూరు విద్యార్థినుల ప్రతిభ

గూడూరురూరల్: వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సోమవారం గూడూరులోని జెడ్పీ హైస్కూలులో డివిజన్ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు చంద్రిక, వెంకట జ్యోత్స్న, శ్రీవర్షిణి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు గూడూరు హైస్కూలు హెచ్‌ఎం వెంకట నాగ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విజేతలను, గైడ్ టీచర్ ప్రవీణ్‌గురును హెచ్.ఎం, టీచర్లు అభినందించారు.

108లో ప్రసవం

రాపూరు: ఓ గర్భిణి 108 వాహనంలో ప్రసవించిన సంఘటన రాపూరు మండలంలోని కొత్తగుండవోలు వద్ద జరిగింది. 108 సిబ్బంది కథనం మేరకు.. మండలంలోని ఓబులాయిపల్లెకు చెందిన పెంచలమ్మకు పురిటినొప్పులు వచ్చాయి. దీంతో ఆమె భర్త చెంచయ్య రాపూరు 108 సిబ్బందికి సమచారం అందజేశారు. సమాచారం అందుకున్న ఆ వాహన సిబ్బంది అబ్దులా, బాబురావు ఓబులాయిపల్లె గ్రామానికి చేరుకుని పెంచలమ్మను వాహనంలో రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోని కొత్త గుండవోలు వద్దకు చేరే సరికి ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది సాయంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వీరిని రాపూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పినట్లు 108 సిబ్బంది తెలిపారు. సిబ్బందికి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేదురుమల్లితో టైం స్కేల్ ఎంప్లాయిస్ సంఘ నేతల భేటీ

వెంకటగిరిరూరల్: పట్టణంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని టైంస్కేల్ ఎంప్లాయిస్ రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు బి సురేష్, నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. 2014నుంచి పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించారని, 1993 నుంచి పని చేస్తున్న టైంస్కేల్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని కోరారు. దీనిపై స్పందించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, సుబ్రమణ్యం, కృష్ణయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం



పెళ్లకూరు: నగదు పంపిణీ చేస్తున్న సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులు, ప్రజలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచి, అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చిల్లకూరులోని గిరిజనులకు బియ్యం, నూనె తదితర నిత్యావసర సరుకులతోపాటు నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం జగన్ సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, సర్పంచ్ హరి బాబురెడ్డి, తహసీల్దార్ రామయ్య పాల్గొన్నారు.

టీడీపీ భూస్థాపితమే లక్ష్యం

నాయుడుపేటటౌన్: టీడీపీని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి తెలిపారు. నాయుడుపేటలో సోమవారం ఎమ్మెల్యే సంజీవయ్యతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలే శిరోధార్యంగా అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ కుటుంబంలో చిన్నపాటి అరమరికలున్నా అందరం సర్దుకుపోతామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ టీ.జనార్దన్‌రెడ్డి, నాయకులు కే రాజారెడ్డి, కే మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి చూపించాలని వినతి

చిల్లకూరు: ముత్యాలపాడు పంచాయతీ పరిధిలోని పెంటపాడు గిరిజనులకు దారి చూపించాలని సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట గోడు వెళ్లబుచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ నాంచారమ్మపేటకు అధికారులు చూపిన దారిని, రెండు రోజులు నుంచి మళ్లీ దారి మూసివేశారని తమ గోడు వెళ్లబుచ్చారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి, దారి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు.


బాలిరెడ్డిపాళేనికి చేరిన అయోధ్య అక్షింతలు



అయోధ్య అక్షింతలకు పూజలు చేస్తున్న అర్చకులు

వాకాడు: అయోధ్య అక్షింతలు సోమవారం బాలిరెడ్డిపాళేనికి చేరాయి. మండలంలోని బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు ఆధ్వర్యంలో వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్ రెడ్డి విశేష పూజలు నిర్వహించారు. ఆయోధ్య రామ మందిరం నుంచి విశ్వహిందూ పరిషత్ ద్వారా అక్షింతలు వచ్చాయని, వీటిని సమరసత సేవా ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు 19 పంచాయతీల్లో ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత తీసుకుందని అనంతాచార్యులు తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

వెంకటగిరిరూరల్: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పొలాల్లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు చేసి, అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేస్తున్న రైతులు సమీపంలోని ఆర్బీకేలో వీఏఏలను సంప్రదిస్తే ఈ పంట నమోదు చేస్తారని తెలిపారు. ఈ పంట నమోదు చేసుకోవడంతో ప్రభుత్వం నుంచి సున్నావడ్డీ, పంట రుణాలు, పంటల బీమా, పరిహారం, రైతు భరోసా, పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పన పొందేందుకు వీలుంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ ఈఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపే లక్ష్యంగా సాగాలి

నాయుడుపేటటౌన్: విద్యుత్ పొదుపు చేయడమే లక్ష్యంగా చేసుకుని, ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఎస్‌పీడీసీఎల్ ఈఈ ప్రసన్నకుమార్ సూచించారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఈఈ అధ్యక్షతన డివిజన్ పరిధిలోని ఆ శాఖ ఉద్యోగులు విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈఈ కార్యాలయం నుంచి పాత బస్టాండులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఏడీఈలు శేఖర్, ఖాదర్‌బాషా, మునిచంద్ర, ఎస్ఐ కృష్ణయ్య, సీ శ్రీధర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెళ్లకూరు: ప్రజాసమస్యలు పరిష్కరించడం కోసం ఈనెల 20వ తేదీ నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. సోమవారం పెళ్లకూరులోని చాగణం ట్రస్ట్ ప్రాంగణాన్ని జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణ కోసం పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లోని ప్రజలు తమ సమస్యలను ఈకార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. వీరి వెంట ఆర్ఐ సంతోషినిబాయ్, వీఆర్వో తేజా తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు తోడ్పాటు



భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

నాయుడుపేటటౌన్: ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు తన వంతుగా తోడ్పాటు ఎప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. స్వర్గధామం (హిందూ శ్మశానవాటిక) వద్ద స్థానిక ఆర్య వైశ్య సంఘంతోపాటు దాతల సాయం సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఉత్తరక్రియలు కోసం నిర్మించిన భోజనశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేటలో స్వర్గధామాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దుతూ ప్రతి ఒక్కరు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయయన్నారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులతోపాటు ప్రజాప్రతినిధులు, అనేక మంది దాతలను సమన్వయంతో హింధూ ధర్మ సేవాసంఘం నిర్వహణలో స్వర్గధామంలో అన్ని వసతులను సమకూర్చుతుండడం ఎంతో శుభపరిణామన్నారు. స్వర్గధామంలో ఉన్న వాహనాలకు ఇద్దరు డ్రైవర్లను మున్సిపాలిటీ తరపున నియమించాలని కోరారని, నిబంధనల మేరకు చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు. ఆక్కడి భోజనశాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించేలా చూడడమే కాకుండా, స్వర్ణముఖి నది నుంచి శ్మశానవాటిక వరకు సుమారు రూ.30 లక్షలకుపైగా నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించడం, పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సంజీవయ్య ఎంతో సహకరించారని హింధూ ధర్మ సేవా సంఘం, ఆర్య వైశ్య సంఘం నాయకులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువ కప్పి, ఘనంగా సత్కరించారు. తరువాత నాయకులు కే రాజారెడ్డి, కే మాధవరెడ్డి, కే సుబ్రమణి, జయరాజగోపాల్, ఎస్ కుమార్‌కు ఎమ్మెల్యే శాలువలు కప్పి సత్కరించారు. ఎన్‌డీసీసీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక, ఆర్యవైశ్య సంఘం గౌరవా ధ్యక్షుడు పీ జయబాబు, పార్టీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, రత్నశ్రీ, నాయకులు కే కిషోర్ యాదవ్, జయరామయ్య, బీ మల్లికారునరెడ్డి, జీ సిద్దయ్య, సీహెచ్ కుమార్, వెంకట కృష్ణారెడ్డి, డీ రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి జ్యోతిపూజ





అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న పండితులు, సెట్టింగులతో ఏర్పాటు చేసిన స్వామివారి ఆలయం

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామి జ్యోతిపూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శబరిమలలో స్వామివారి ఆలయ ప్రతిమ తీర్చిదిద్దారు. కేరళకు చెందిన అజిత్ నంబూద్రి స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో అయ్యప్ప పూజ ప్రారంభించారు. స్వామివారికి 18 రకాల ద్రవ్యాలతో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. 108 కలశాల్లో ద్రవ్యాలతో అయ్యప్పమాల వేసిన భక్తుల చేతుల మీదుగా స్వామివారి పంచలోహ విగ్రహానికి అభిషేకాలు చేశారు. అలాగే 18 రకాల విశేష అభిషేక ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. 18 రకాల ప్రసాదాలతో స్వామి వారికి మహానైవేద్యం సమర్పించారు. సాయంత్ర అఖండ జ్యోతులతో స్వామి వారి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. రాత్రిస్వామి వారికి భక్తి శ్రద్ధలతో పడి పూజ జరిపారు. అనంతరం 22వ జ్యోతి దర్శన కార్యక్రమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో అయ్యప్ప మాలాధారణ చేసిన భక్తులు పాల్గొని, స్వామి వారికి విశేష పూజలు చేశారు. 108 కలశాలతో కన్నె స్వాములు స్వామి వారికి అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు.

జగనన్న పాలన చరిత్రాత్మకం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చరిత్రత్మాకమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డు మల్లమ్మ గుడి ప్రాంతంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల నుంచి సంక్షేమపథకాల అమల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేదురుమల్లి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో నవరత్నాలతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు నింపారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, కౌన్సిలర్లు గోపాలకృష్ణ, నారాయణ, ఆరిశంకరయ్య, వహిద, ఏ శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, వహిద, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, ప్రముఖ న్యాయవాది ఎల్ కోటేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ నేతలు ఆర్ చిన్నా, సీహెచ్ మురళి, ఎం సురేంద్ర, పి ప్రకాష్, యస్థాని తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరికి చేరిన వన్స్‌మోర్ జగనన్న పాదయాత్ర



సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేత

వెంకటగిరిరూరల్: వన్స్‌మోర్ జగనన్న పాదయాత్ర సోమవారం వెంకటగిరికి చేరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో వైఎస్సార్ అమర జ్యోతి స్టూడెంట్స్ అండ్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గాలి గణేష్ ఆధ్వర్యంలో వన్స్‌మోర్ జగనన్న పాదయాత్ర పేరుతో అనకాపల్లి నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. ఈ యాత్ర వెంకటగిరికి చేరింది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ మళ్లీ జగనన్న సీఎంగా చేసుకోవాలని ప్రజలను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, న్యాయవాది సుంకర రాజేష్ వెంకటగిరిలో జరిగిన పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

